కర్నూలు పాతనగరం ఖండేరిలో ప్రజాపోరుయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రభుత్వ పాఠశాల విద్య పరిరక్షణకు...

నేటి నుంచి యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

• హాజరుకానున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్య పరిరక్షణ నినాదంతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు సన్నద్ధమైంది. గూడూరు మండల కేంద్రంగా శని ఆదివారాలు రెండు రోజులపాటు ఈ మహాసభలు జరగనున్నాయి. ఈ మహాసభలను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ , జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్ ప్రారంభించనున్నారు. రెండు రోజులపాటు జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను ప్రకటించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహించుకుంటుంది. ప్రభుత్వ పాఠశాల విద్య రంగాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతోంది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. పాఠశాల విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల గొంతుకగా ఈ సంఘం వ్యవహరిస్తుంది. కర్నూలు జిల్లాలో దాదాపుగా ఈ సంఘానికి 5,000 మందికి పైగా సభ్యత్వం కలిగిన అతిపెద్ద సంఘంగా అవతరించింది.

మహాసభల ముఖద్వారం వద్ద ఉన్న సురేష్‌కుమార్, నాయకులు

ఉపాధ్యాయుల ఉద్యమ గొంతుక యుటిఎఫ్

ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడేది ఏకైక సంఘం యుటిఎఫ్ మాత్రమే అనేది ఉపాధ్యాయులు నమ్ముతారు. గత ప్రభుత్వ హయాంలో పిఆర్‌సి ఉద్యమంలో యుటిఎఫ్ క్రియాశీలకంగా వ్యవహరించింది. అప్పటి వైసిపి ప్రభుత్వం ప్రకటించిన పిఆర్‌సిలో ఉద్యోగులు ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని పిఆర్‌సి సాధన కమిటీ పేరుతో ఉద్యమ ప్రణాళికను రూపొందించి ముందుకు సాగింది. ప్రభుత్వం ప్రకటించిన అనేక వాటిలో కొంతమేరకు సాధించుకున్నారు. హెచ్‌ఆర్‌ఎలో 8శాతం నుంచి 10శాతం, 10 నుంచి 12 శాతాన్ని సాధించుకున్నారు. పదేళ్లకోసారి పిఆర్‌సి ప్రకటనను వెనక్కి తగ్గి ఐదేళ్లకోసారి వేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటితోపాటు జిపిఎఫ్ తదితర ఆర్థిక బకాయిలను కూడా చెల్లించడంలో యుటిఎఫ్ ఎంతో పోరాటం చేసింది. ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా తీసుకువచ్చిన జీవో నెంబర్ 117 ను కూడా సవరించాలని రాష్ట్రవ్యాప్తంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల ద్వారా బస్సు యాత్ర నిర్వహించి అనేక ప్రాథమిక పాఠశాలలను కూడా మూసి వేయకుండా అడ్డుకోగలిగారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిపిఎస్ అమలుకు కార్యరూపం దాలుస్తూ గజిట్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన బాట పట్టగా ప్రభుత్వం వెంటనే దిగివచ్చి గజిట్‌ను రద్దు చేసింది. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులను బదిలీలను ఇతర సమస్యలను పరిష్కరించాలని పోరుబాట పట్టడంతో పదోన్నతుల కల్పనకు గాను విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సురేష్‌కుమార్, జిల్లా నాయకులు నీవన్ పాటి

మూడు వేదికలతో సభ నిర్వహణ

గూడూరులో జరుగుతున్న జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు మూడు వేదికలను సిద్ధం చేశారు. గూడూరు కేంద్రంగా పనిచేసిన నాయకుడు బెంజిమెన్ పేరుతో స్వాగత వేదికను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో యుటిఎఫ్‌లో పోరాటం చేసిన దత్తు పేరుతో మరో వేదికను సిద్ధం చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి పేరుతో శాంతినగర్‌ను కూడా ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రదర్శనతో ఈ మహాసభలు ప్రారంభమవుతాయి. మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు , రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. శామ్యూల్ పాల్ పాల్గొని ప్రసంగిస్తారు.

సమస్యలపై సిపిఎం

'ప్రజా పోరు' ప్రారంభం

- 14న మండల కేంద్రాలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-విలేకరులు

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నుంచి ఈనెల 14 వరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరుతో ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పాతనగరంలో ఖండేరిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, 36, 37 వార్డులు వీకర్ సెక్షన్ కాలనీలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, నగర కార్యదర్శి టి.రాముడు, గోనెగండ్లలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఆనంద్‌బాబు ప్రారంభించారు. కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న అన్ని మండల కేంద్రాలు, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ప్రజాసమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

కర్నూలు కార్పొరేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలను ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. 1వ వార్డు ఖండేరి వీధిలో ఆయన ప్రారంభించారు. గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ప్రజల పైన ఎటువంటి భారాలు వేయమని, కరెంట్ చార్జీలు అస్సలు పెంచబోమని చెప్పిన సిఎం చంద్రబాబు నాయుడు ఈ నాలుగు నెలలోనే రూ.20 వేల కోట్ల కరెంటు చార్జీల భారాన్ని మోపడం సరైంది కాదన్నారు. దీనిపై చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరి ప్రజలపైన మోయలేని భారాలను వేస్తున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా ఈ నాలుగు నెలల్లో పెరిగాయని, ఎందుకు ధరలు తగ్గించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక మంచి నూనె ధర నే దాదాపు రూ.40 పెంచినారంటేనే ప్రజల పైన ఉన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. ప్రజా సమస్యలు పాలక ప్రభుత్వానికి పట్టడం లేదని ఘాటుగా విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి.షరీఫ్ మాట్లాడుతూ ఈ నెల 14న కలెక్టరేట్ ముందు ధర్నాలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మద్దిలేటి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుంకన్న, షేక్‌షావలి, నూర్ భాషా, మణి కుమార్, అనిల్ కుమార్, శేఖర్, గిరి ,మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డు శ్రీరామనగర్ : 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పోరుయాత్ర నిర్వహించారు. వార్డు కార్యదర్శి కెవి.జనార్ధన్ రావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడారు. వాడవాడలా తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తూ, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గేవరకు, ప్రజలపై వేస్తున్న కరెంటు భారాలను తగ్గించే వరకు, టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుహామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈనెల 14న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నగర నాయకులు సి. శేషాద్రి, సి.ఎల్లయ్య, సోషల్ మీడియా జిల్లానాయకులు ఎల్లగౌడు, మునిస్వామి, సిపిఎం నాయకులు ఎస్.అజ్మత్, టి. రంగయ్య, ఆర్.రాజు, వి.రాజు, జి.వెంకటేశ్వర్లు , ఆర్.రవి కిషోర్, హమాలీ యూనియన్ నాయకులు సురేష్, నాగన్న, సూర్య రాజు, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని 36, 37 వ వార్డులు వీకర్ సెక్షన్ కాలనీలో ప్రజా పోరు యాత్రను చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలమ్మ, కె.అరుణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప. కె.ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు ఎస్. శ్యామలమ్మ, ఎం.జమ్మన్న, ఎస్. ఉసేన్ బాష వార్డు కార్యదర్శి యస్ అబ్దుల్ రహిమాన్, యస్ సత్యం, యన్ మద్దిలేటి, సి సాయి, పాల్గొన్నారు. ప్రజా పోరు యాత్ర బీడి వర్కర్సకాలని, పచ్చబిల్డింగులు, సూర్యనారాయణనగర్, డిష్ ఏరియా ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు.

యాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

వీకర్ సెక్షన్‌లో మాట్లాడుతున్న రాముడు

ఎస్‌హెచ్‌డి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

- కలెక్టర్ రంజిత్‌బాష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సి.క్యాంపులో మహిళా మార్ట్, డ్వాక్రా బజార్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పెద్ద పెద్ద మార్టులు, షాపులతో టై అప్ చేసి మార్కెటింగ్ లింకేజి డెవలప్ చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులతో ఒక ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌డిఎ పిడి నాగశివ లీల తదితరులు పాల్గొన్నారు

మహిళా మార్ట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

సచివాలయాలు ఆకస్మిక తనిఖీ

సి.క్యాంప్‌లోని సచివాలయం 61, 62 లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా సచివాలయంలోని సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది కొంతమంది మాత్రమే ఉండడంతో ఎక్కడికి వెళ్లారని కలెక్టర్ ఆరా తీశారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

- బిఎల్‌ఒలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 కార్యక్రమంలో భాగంగా 9, 10 తేదీ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం ఆయన నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, కౌన్సిల్ హాలులో బిఎల్‌ఒలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. 9,10వ తేదీల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు బిఎల్‌ఒలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు (ఫారం-6), ఓటు తొలగింపు (ఫారం-7), వివరాల మార్పునకు (ఫారం-8) దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అనంతరం కమిషనర్ బిఎల్‌ఒలతో మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బిఎల్‌ఒలు రెండు రోజుల పాటు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్ళు నిండే ప్రతి ఒక్కరూ అర్హులని, జాబితాలో సవరణలు, ఓటు తొలగింపులకు సంబంధింత దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని 18 ఏళ్లు నిండిన వాళ్లు పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఆర్‌ఒ, తహశీల్దార్ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజుర్ బాష, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పురుషోత్తమాచారి పై చర్యలు తీసుకోవాలి

డిఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

విద్యార్థుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు పురుషోత్తమాచారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం డిఇఒ శామ్యూల్ పాల్‌ను ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షులు రంగప్ప తోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, సురేష్, కిషోర్ ఉన్నారు. ఈ సందర్భంగా రంగప్ప మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పురుషోత్తమాచారి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. విద్యార్థులను కులం పేరుతో కూడా దూషిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే తమరు జోక్యం చేసుకొని అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పిజిఆర్ఎస్ అర్జీలకు మ్యాపింగ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను మ్యాపింగ్ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ రిజిస్ట్రేషన్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో " కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా రెవెన్యూ అధికారి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.డిఆర్‌ఒ మాట్లాడుతూ దరఖాస్తులను కంప్యూటర్‌లో తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వచ్చిన అర్జీ ఏడిపార్టుమెంట్ సంబంధించినదని తెలుసుకొని వారికి పంపించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల సమయం వృథా కాకుండా నిర్ణీత సమయంలోనే అర్జీదారునికి సమస్య పరిష్కరించవచ్చన్నారు. కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, జిల్లాస్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్యసమావేశం

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కీలకమైన సమస్యలపై చర్చించకుండా మొక్కుబడిగా నిర్వహించారు. సి బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొంతల మునెప్ప అధికారులతో సమీక్షించేందుకు శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ రానెమ్మ, తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొని ఆయా సమస్యలపైనలోతుగా చర్చించలేదు. మండలంలో రోడ్ల దుస్థితి, పాలన తీరు, అలాగే కుంటు పడిన సంక్షేమం ప్రజలకు,రైతులకు గాడి తప్పిన పౌర సేవలు వంటి వాటిపై పట్టిపట్టనట్లుగా చర్చలు చేశారు.

నెలకే అతుకులబొంతలా పెద్దపాడు రోడ్డు

-రూ.కోట్ల ప్రజాధనం వృథా -గత ప్రభుత్వ బాటలో కూటమి ప్రభుత్వం

-పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఈ పుల్లారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : గత ఏడాది నుండి కర్నూలు పెద్దపాడు మధ్య రోడ్డు విస్తరణ పనులు, డివైడర్ నిర్మాణాలు నాసిరకంగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో వేసిన నెల రోజులకే అతుకుల బొంతలా రోడ్డు తయారై రూ.కోట్ల ప్రజాధనం వృధా అవుతుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, నివాస ప్రాంతాల అసోసియేషన్ ప్రతినిధి పి.సూర్య శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం, పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులతో కలసి పెద్దపాడు రోడ్డుపై పర్యటించారు. వారు మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తి కాకముందే పెంకులు పెంకులుగా లేస్తూ పాత రోడ్డులా కనిపించిందని అన్నారు. కొన్నిచోట్ల కంగిపోతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో అధికారులు స్పందించలేదని..ఈ ప్రభుత్వంలోనైనా స్పందిస్తారని అనుకున్నామన్నారు. గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా నడుస్తున్నట్లుగా ఉందని అన్నారు. కాంట్రాక్టర్ బిల్లుల కోసం శిథిలమవుతున్న రోడ్డును పైపై మెరుగులు దిద్దుతున్నారని విమర్శించారు. నాసిరకంగా రోడ్డు విస్తరణ పనులు, డివైడర్ లో మొక్కల కోసం పనికిరాని మట్టి వేస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రహదారుల శాఖ సూపరిండెంట్ ఇంజనీర్‌కు వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నాసిరకం నిర్మాణ పనులపై విచారణ జరిపి కాంట్రాక్టర్ తో పాటు సంబంధిత ఇంజనీర్ పై చర్య తీసుకుని ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. పీటర్, ఇ శివ శంకర్ రెడ్డి, కె.వెంకట్ నర్సు, డి. ప్రభాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, పి పి ఎస్ ఎస్ నాయకులు సివివర్మ, కె. శ్రీనివాసులు, బి రాజు పాల్గొన్నారు.

వేగవంతంగా రేడియాలజీ సేవలు

-జి జి హెచ్ లో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం

-ఆసుపత్రి సూపరింటెండెంట్ డా క్టర్ కె వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రోగులకు వేగవంతంగా సేవలు అందించేందుకు మీడియాలజీ విభాగాన్ని ఆధునికరించామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవ వేడుకలు హెచ్ఒడి డాక్టర్ రాధారాణి అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఒకప్పుడు ఎక్సరే ,స్కానింగ్ సేవలు మరుసటి రోజు రిపోర్టులు వచ్చేవని, అలాంటి పరిస్థితికి ఇప్పుడు స్వస్తి పలికారన్నారు. పేషంట్లకు ఇబ్బంది కలగకుండా ఎక్సరే , స్కానింగ్ తీసిన ఒక గంట వ్యవధిలోనే ఫిలిమ్స్, రిపోర్ట్స్ అందజేస్తున్నామని అన్నారు దీని ద్వారా పేషెంట్లకు సత్వర ట్రీట్మెంట్ అందనున్నట్లు తెలిపారు. రేడియాలజీ విభాగానికి అత్యాధునిక టెక్నాలజీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, ఈ విభాగానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా వారికి చేయడానికి సిద్ధమేని తెలిపారు.ఆసుపత్రిని అభివృద్ధి చేయడానికి మరింతగా కృషి చేయనున్నట్లు తెలిపారు. రేడియాలజీ సిబ్బంది మరింత బాగా కష్టపడి ఆస్పత్రికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, రేడియాలజీ హెచ్ఒడి, డాక్టర్ రాధారాణి, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, రేడియాలజీ విభాగపు వైద్యులు, డాక్టర్ హరినాథ్, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

సంత మార్కెట్ సిఐటియు ఆఫీసు నుంచి శుక్రవారం ర్యాలీగా బయలుదేరి ఎమ్మార్వో ఆఫీస్ చేరుకొని ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి జిపి.వీరన్న అధ్యక్షతన ధర్నా చేశారు. విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు గుంటప్ప, సిఐటియు మండల అధ్యక్షులు ఎంఎస్ఎ.గఫూర్ మియా ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో 28 వేలమంది విఒఎలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం మూడు సంవత్సరాలు విఒఎగా పని చేసిన వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని 2019 నవంబర్లో సర్క్యులర్ జారీ చేశారన్నారు. నాటినుండి నేటి వరకు కాల పరిమితి సర్క్యులర్ రద్దు కోసం, ఉద్యోగ భద్రత కోసం హెచ్ఆర్ పాలసీ అమలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, జెండరపేరుతో తొలగింపులు తదితర డిమాండ్ల సాధనకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కోడుమూరులో మహిళా మార్ట్‌లో బలవంతపు సరుకులు కొనుగోలు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా విఒఎలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కోడుమూరు ఎమ్మార్వో వెంకటేష్ నాయక్ ఇచ్చారు. ఎమ్మార్వో మాట్లాడుతూ మీరిచ్చిన వినతిపత్రాన్ని మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఎం సుబ్బయ్య సిఐటియు నాయకులు, విఒఎలు వినతిపత్రం ఇచ్చారు.

అధికారికి వినతిపత్రం ఇస్తున్న గఫూర్‌మియ్యా, వీరన్న , తదితరులు

పైపులైన్ల మరమ్మతు త్వరగా పూర్తి చేయాలి

నగరపాలక మేయర్ బివై. రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో పైపు లైన్లు మరమ్మతులకు గురైనప్పుడు వాటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ మేయర్ బివై.రామయ్య, సంబంధింత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐదు రహ దారులకూడలిలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులను మేయర్ పరిశీలించారు. విఠల్‌నగర్, విద్యానగర్, గాంధీనగర్, మేడంకాంపౌండ్, నంద్యాలగేటు, తదితర ప్రాంతాలకు సంబంధించిన తాగునీటి పైపులైన్ గత రెండు రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా అంతరాయం ఏర్పడగా, శుక్రవారం సమస్య ప్రదేశాన్ని గుర్తించి, మరమ్మతు పనులను అధికారులు, సిబ్బంది పూర్తి చేశారు. ప్రజలకు తాగునీటి సరఫరా అంతరాయం కలగకుండా, దృష్టికి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తూ ఉండాలని సూచించారు. ఇందులో జాప్యం తగదని, మరమ్మతు పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఇ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండు రోజులపాటు ఓటరు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ జాబితా సవరణలో భాగంగా శని ఆదివారాల్లో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పి రంజిత్ బాష శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బిఎల్‌ఒలు ఓటర్ నమోదు దరఖాస్తులను స్వీకరించనున్నారని పేర్కొన్నారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-మద్దికేర



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామపంచాయతీ ఖాతాలకు జమ అయినట్లు ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి విడత నిధులు బేసిక్ గ్రాంట్, టైట్ గ్రాంటును గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలకు సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో బసనేపల్లి రూ.5,51,269, బొమ్మన పల్లెకు రూ.2,41,821 బురుజులకు రూ.4,48,558, హంపకు రూ.3,61,720 అగ్రహారం కు రూ.10, 26, 223 మద్దికేరకు రూ.32,12,158 పెరవలికి రూ.17,42,774 యడవలికి రూ.3,37,163 నిధులు కేటాయించినట్లు తెలిపారు. టైట్ నిధులను పారిశుద్ధ్య పనులకు, మంచినీటి సరఫరాకు, బేసిక్ గ్రాంట్‌ను గ్రామ అభివృద్ధికి పనులకు సర్పంచులు, కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గోనెగండ్లలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

15న ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా

- సిపిఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం తలపెట్టిన 'ప్రజాపోరు'లో భాగస్వామ్యం కావాలని, ఈనెల 15న ఎంపిడిఒ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు కోరారు. శుక్రవారం గోనెగండ్లలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద సిపిఎం ప్రజాపోరుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి, ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం సిపిఎం మండల నాయకులు నబి రసూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌బాబు, సిపిఎం మండల శాఖ కార్యదర్శి బి.కరుణాకర్, మండల నాయకులు దండు భాషా మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. రూ.6,072 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని మండిపడ్డారు. ముందు బిల్లు చెల్లించి విద్యుత్‌ను కొనే స్మార్ట్ మీటర్లను ప్రయివేట్ వ్యక్తుల ద్వారా ఇళ్లకు బిగిస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పనుల్లేక కుటుంబాలకు కుటుంబాలు ఖాళీ చేసి వలసలు వెళ్తున్నారని చెప్పారు. మండలంలోని గ్రామాల్లో ఈనెల 14 వరకు ప్రచారం నిర్వహించి 15న ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. మండల నాయకులు గిరిరాజు, రామదాసు, నరసింహులు, జయన్న, మునిస్వామి, రంగస్వామి పాల్గొన్నారు. ఆదోని పట్టణంలోని కార్మిక్ పేట ఏరియాలో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన, పట్టణ నాయకులు వీరేష్, వెంకటేశులు, నాగేంద్ర, వెంకటేష్, శ్రీనివాసులు ఉన్నారు.

గోకులం షెడ్లు ఉపయోగకరం

- సర్పంచి లక్ష్మీ దేవమ్మ, ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న సర్పంచి, అధికారులు

గోకులం షెడ్లు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని సర్పంచి లక్ష్మీ దేవమ్మ, ఎంపిడిఒ అల్లా బకాష్, ఎపిఒ జబీర్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తొలివిడతగా దౌల్తాపురం గ్రామంలో రూ.1.80 లక్షల ఉపాధి హామీ నిధులతో రైతు మేకల రామాంజనేయులు గోకులం షెడ్డు నిర్మించుకున్నారు. నూతన గోకులం షెడ్డును సర్పంచి లక్ష్మీదేవమ్మ, ఎంపిడిఒ అల్లా బకాష్ చేతుల మీదుగా పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో తొలివిడతగా మంజూరైన గోకులం షెడ్లను త్వరగా నిర్మించుకుంటే బిల్లులు సకాలంలో అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం రైతులకు సహాయం అందిస్తున్నారు. గోకులం షెడ్లు పశువులకు, వ్యవసాయ పనిముట్లకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఇంత త్వరగా నిర్మించుకున్న రైతు మేకల రామాంజనేయులను అభినందించారు. సర్పంచి, ఎంపిడిఒలను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. టిడిపి నాయకులు లక్ష్మన్న, ప్రభాకర్, కృష్ణారెడ్డి, రాజశేఖర్, సి.హెచ్, పంచాయతీ కార్యదర్శి సుధీర్, వీఆర్ఒ, పెద్దన్న, ఉపాధి హామీ సిబ్బంది రాధాకృష్ణ, మారుతి, అంజి, నాగేంద్ర, విద్యా కమిటీ చైర్మన్ నెట్టెకంటయ్య పాల్గొన్నారు.

ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి - ఆలూరు

ముళ్లకంపను తొలగించిన అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న ముళ్లకంపను అధికారులు తొలగించారు. ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన 'ముళ్ల కంపలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. శుక్రవారం మండలంలోని మనేకుర్తి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న ముళ్లకంపను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ, పట్టణాల్లో, రైతుల పొలాల్లో విద్యుత్ ప్రమాదాలకు గురై కుటుంబాలు నాశనం అవుతున్నాయని, అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ప్రజలు కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా 'చలో చీరాల'

ప్రజాశక్తి-ఆలూరు

వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చలో చీరాల' బహిరంగ సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి హెబ్బటం వన్నూరప్ప కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మల్లెల వెంకటరావు అధ్యక్షతన జరగబోయే 'చలో చీరాల'ను జయప్రదం చేయాలని కోరారు.

నేలకూలిన మహావృక్షం

- గోనెగండ్ల సొసైటీలో మహా వృక్షాన్ని తొలగించిన సిఇఒ
- ఆగ్రహించిన స్థానికులు, రైతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని సొసైటీ కార్యాలయంలో మహావృక్షాన్ని నేలకూల్చారు. 60 ఏళ్ల నుంచి చల్లటి గాలిని ఇచ్చి, వివిధ అవసరాలపై వచ్చి తన నీడలో సేదతీరే ఎంతోమంది రైతులకు, ప్రజలకు ఆశ్రయం కల్పించిన మహా వృక్షాన్ని ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా, సరైన కారణం లేకుండా నేలకూల్చారు. గోనెగండ్లలోని వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఒక భారీ చింతవృక్షం ఉండేది. వివిధ గ్రామాల నుంచి వ్యక్తిగత అవసరాల నిమిత్తం, సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్‌కు వచ్చే రైతులు, ప్రజలకు సుమారు 60 ఏళ్ల నుంచి చల్లటి గాలిని అందిస్తూ తన నీడలో సేద తీర్చేది. అలాంటి మహావృక్షాన్ని పంచాయతీ నుంచి కానీ, అటవీ శాఖ నుంచి కానీ ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా, సరైన కారణం లేకుండానే రంపపు యంత్రంతో నేల కూల్చి ముక్కలు ముక్కలుగా చేయించారు సొసైటీ సిఇఒ జి.చంద్రశేఖర్. 60 ఏళ్ల నుంచి లేని ఇబ్బంది ఇప్పుడు ఎందుకొచ్చింది.. ఎందుకిలా పచ్చటి మహావృక్షాన్ని కూల్చారని ప్రశ్నిస్తే.. సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జీ (పిఐఒ) అధికారి శ్రీనివాసులు ఆదేశాల మేరకే తాను ఈ చెట్టును తొలగించినట్లు తెలిపారు. కొంతమంది గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ తన సిబ్బందితో హుటాహుటిన సొసైటీకి చేరుకున్నారు. నేలకూలి ముక్కలుగా మారిన వృక్షాన్ని పరిశీలించి.. అది ఎంత విలువ చేస్తుందనే దానిపై కొలతలను నమోదు చేసుకున్నారు.

కొలతలు తీస్తున్న ఫారెస్ట్ అధికారులు

చట్టపరమైన చర్యలు

- బీట్ ఆఫీసర్ అనురాధ

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వాలు కొత్త, కొత్త చట్టాలు తెస్తుంటే... ఉన్న మహా వృక్షాన్ని ఎలాంటి అనుమతులూ లేకుండా నేలకూల్చారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి చట్టపరంగా తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

మంత్రాలయం పవిత్రతను కాపాడాలి

- టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలను నిలిపేసి క్షేత్ర పవిత్రతను కాపాడాలని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎల్లారెడ్డి కోరారు. శుక్రవారం టిడిపి కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా శ్రీరామ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు మాధవరం, మాలపల్లి గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారని తెలిపారు. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, 10 మంది వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంత మార్కెట్, రామచంద్ర నగర్, రాఘవేంద్ర నగర్ కాలనీలోని డోర్ డెలివరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్టు షాపులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని చెప్పారు. ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 9వ తరగతి చదువుతున్న సంజీవ్ కుమార్, 7వ తరగతి చదువుతున్న రంజిత్ కుమార్‌లు కూడా పాఠశాల ఆవరణంలో మద్యం వ్యాపారులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, తెలుగు యువత, జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, నాయకులు కృష్ణమోహన్ రెడ్డి, పవన్ కుమార్, వగరూరు అబ్దుల్, హండే అనుమంతు, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, వనికె నాగరాజు, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జనావాసాల మధ్య మద్యం దుకాణాలు తొలగించండి

- సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల భద్రత కోసం పని చేయాల్సిన పోలీసులు మద్యం దుకాణదారులతో కుమ్మక్కై, గుడి, బడి అనే తేడా లేకుండా గుడి పక్కనే మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వడంపై మండిపడ్డారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు వారు మాట్లాడారు. సిద్ధేశ్వర స్వామి దేవాలయం, జడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో వైన్స్ షాపునకు అనుమతులు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ముందు నుంచి జడ్‌పి ఉన్నత పాఠశాల, రాయల్ రిఫా పాఠశాలలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అలాగే మద్యం దుకాణానికి సమీపంలో లక్ష్మి దేవాలయం ఉండడంతో నిత్యం మహిళలు ఈదారి వెంట వెళ్లి దేవాలయంలో పూజలు చేస్తుంటారని చెప్పారు. మందుబాబులు మద్యం సేవించి మహిళలపై, విద్యార్థులపై దాడులు, అఘాయిత్యాలు పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రజలు తిరిగే చోట మద్యం దుకాణానికి అనుమతి ఎలా ఇస్తారని మండిపడ్డారు. అధికారులు మద్యం దుకాణం తొలగించకపోతే కార్మిక, విద్యార్థి, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆలూరు ఎక్సైజ్ సిఐ లలితను వివరణ కోరగా... ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చామని, పాఠశాలకు 100 మీటర్ల దూరంగా ఉన్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న నాయకులు

జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు సునీల్ రాజ్ కుమార్, జగన్ మోహన్ కోరారు. శుక్రవారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడే ఏకైక సంఘం యుటిఎఫ్ మాత్రమేనని చెప్పారు. ఈనెల 9, 10న గూడూరు జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభల్లో పాల్గొనాలని కోరారు. యుటిఎఫ్ గౌరవ సలహాదారులుగా గిరిబాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, ఇమ్రాన్, రంగన్న, సాల్మన్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని రైల్వే గేట్‌కు సంబంధించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ ప్రాంతాలను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని డీఎస్పీ బంగ్లా రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి రైల్వే లైను మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. లైను మీదుగా ఆర్‌ఆర్ లేబర్ కాలనీ వెళ్లే రహదారి వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఉంటుందని తెలిపారు. రైల్వే అధికారుల నుంచి అనుమతి వచ్చిందని, స్థల పరిశీలన చేసి నివేదిక పంపుతామని చెప్పారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్ ప్రసాద్, రైల్వే డిప్యూటీ ఇంజినీర్ ఉమాపతి ఉన్నారు.

నమూనాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఓటర్ల జాబితా పక్కాగా నిర్వహించాలి: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా పక్కాగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. ట్యూటర్లు పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయకట్టు భూములున్న రైతులందరూ ఓటర్లుగా ఉండాలని తెలిపారు. ఆయకట్టు భూమి కొనుగోలు చేసిన వారు కూడా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 10లోగా ఓటు కోసం దరఖాస్తులు స్వీకరించి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పవన్‌తో ఉన్న రాజేశ్వరి

నిర్లక్ష్యం చేస్తున్నారు..!

- పవన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో జనసేన నాయకులను నిర్లక్ష్యం చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు జనసేన వీర మహిళ రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌ను కలవాలని ఈనెల 3న ఆదోని నుంచి అమరావతికి సైకిల్‌పై ప్రయాణం మొదలు పెట్టామని తెలిపారు. 6న జనసేన కార్యాలయానికి చేరుకున్నానన్నారు. 7న పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. జనసేన పార్టీ కోసం, కార్యకర్తల సంక్షేమానికి పాటుపడుతున్న ఇన్‌ఛార్జీ మల్లప్పకు తగిన న్యాయం చేయాలని కోరినట్లు చెప్పారు. నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాను సైకిల్‌పై ప్రయాణించడం పట్ల పవన్ కల్యాణ్ అభినందించారని పేర్కొన్నారు.

సమయపాలనకు ప్రాధాన్యత

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

సచివాలయ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగీ సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో సచివాలయాన్ని తనిఖీ చేసి, అటెండెన్స్, రికార్డులను పరిశీలించారు. సచివాలయ విధులపై డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామస్తులు తీసుకొచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఏ ఆదేశాలు ఇచ్చినా అలసత్వం వహించకుండా నెరవేర్చాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు దగ్గరకు చేర్చే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రెవెన్యూ కార్యదర్శి పెద్దన్న పాల్గొన్నారు.

దళితులపై అక్రమ కేసులను ఎత్తేయాలి

- ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - హాలహర్వి

దళితులపై అక్రమ కేసులను ఎత్తేయాలని ఎంఆర్‌పిఎస్ పార్లమెంట్ అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం హాలహర్వి జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుడైన హుస్సేన్‌పై అక్రమ కేసు బనాయించడం సబబు కాదని, దాడులు చేసిన వారిపై కాకుండా దళితులపై కేసు పెట్టడం దుర్మార్గమని తెలిపారు. అధికారులు, పోలీసులు వాస్తవాలను చూడాలని, నాయకులు చెప్పిన మాటలు విని కేసులు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. ప్రభుత్వం స్పందించి దళితులపై దాడులు, అక్రమ కేసులపై విచారించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు వీరేష్, యాలప్ప, కృష్ణ పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

భూ సమస్యలను పరిష్కరిస్తాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని మాంత్రికి గ్రామంలో రీసర్వేలో నెలకొన్న భూసమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మాంత్రికి గ్రామంలో రీ సర్వేపై గ్రామసభ నిర్వహించి, రైతుల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. సమస్యలను విచారించి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. తహశీల్దార్ శివరాముడు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

'డీలర్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల్లో నవంబర్ కోటా కంది పప్పు తగ్గించిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలకు నవంబర్ కంది పప్పు కోటాను తగ్గిస్తూ డీలర్ (షాప్ నెంబర్ 28) ఇవ్వడం దారుణమని తెలిపారు. అర్బన్ కేంద్రంలోని 43వ కేంద్రంలో 19 కిలోలు, 62లో 20 కిలోలు, 68లో 23 కిలోలు, 69లో 29 కిలోలు, 70వ కేంద్రంలో 38 కిలోలు కోటా ఒఆర్‌లో కేటాయించారని చెప్పారు. డీలర్ ఒక్కో కేంద్రంలో 12 కిలోల వరకు తక్కువ ఇచ్చారని చెబుతూ, తగ్గించిన కోటాను తీసుకెళ్లాలని చెప్పాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడతారని తెలియజేసినా డీలర్ పట్టించుకోలేదని అంగన్వాడీలు తెలిపారు. అవకతవకలపై విచారణ చేపట్టి, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్వాడీలు సలీమా భాను, జయ లక్ష్మమ్మ, ఖైరోన్ బీ, గౌసియా బేగం, ప్రజాసంఘాల కార్యకర్తలు లక్ష్మీనరసయ్య, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం

- హోళగుందలో పందుల బెడద
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో పందుల బెడదతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ వీధిలో చూసినా పందులు దర్శనమిస్తూ మహిళలపై దాడికి దిగుతున్నాయి. పందులను ఊరికి దూరంగా తరలించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రజల అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పందుల యజమానులు పందులను హోళగుంద గ్రామంలో వదిలేసి గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారు. ఎవరైనా 'పందులు మీవే' అని ప్రశ్నిస్తే, 'మావి కాదు. మాకు సంబంధం లేదు' అని మాట దాటవేస్తూ తప్పించుకు తిరుగుతున్నారు. చెత్తాచెదారం ఎక్కువై అపరిశుభ్రత ఉన్న ప్రాంతాల్లో పందులు సంచరిస్తూ నివాసాల ముందుకొస్తున్నాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి చొరపడుతున్నాయని మహిళలు వాపోతున్నారు. పందుల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోతున్నారు.

ఇళ్ల మధ్యలో సంచరిస్తున్న పందులు

నిబంధనలు గాలికి

నిబంధనల ప్రకారం పందుల యజమానులు ఊరికి చివరన జన సంచారం లేని చోట షెడ్ ఏర్పాటు చేసుకొని పందులను పెంచుకోవాలి. ఈ నిబంధనలను గాలికి వదిలేసి జనసంచారం ఉన్న చోట, ఊరు మధ్యలో పందులను వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. పందులు గ్రామాల్లో నివాసయోగ్యమైన ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలు అనారోగ్యం పాలు కావడానికి కారణమవుతున్నాయి. కూలి, నాలి చేసిన డబ్బును వైద్యం కోసం ఖర్చు పెట్టి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పందులను తోలడానికి వెళ్లిన మహిళలపై దాడికి దిగుతూ కరవడానికి వస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

పందులు గ్రామాల్లో సంచరిస్తుంటే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాడవాడల పరిశుభ్రతతో పాటు పందులు, జంతువులు ప్రజలకు హాని కలిగిస్తే వాటిని దూరంగా ఉంచడంలో అధికారుల అలసత్వం వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పందులు గ్రామాల్లో సంచరించకుండా చర్యలు చేపట్టాలని, లేకపోతే మండల కార్యాలయాల ముందు ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

పందుల వల్ల అనారోగ్యం పాలవుతున్నాం

- వరాల వీరేష్



పందులు గ్రామాల్లో సంచరించడం వల్ల అనారోగ్యం పాలవుతున్నాం. నాలుగు రోజులుగా మా కుటుంబమంతా జ్వరాలతో బాధపడుతున్నాం. పందులను దూరం తరలించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పందులు గ్రామాల్లో సంచరిస్తుంటే పట్టించుకోకపోవడం బాధాకరం. మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

పందులతో సహజీవనం చేసినట్లుంది

- రాళ్ల కొట్టే నాగరాజు

పందులతో సహజనం చేసినట్లుంది. రోజూ ఇళ్ల ముందు సంచరిస్తాయి. పక్కకు తోలడానికి వెళితే మనుషులపై దాడి చేస్తున్నాయి. మహిళలు, పిల్లలు బయట తిరగడానికి వీలు లేకుండా పోయింది. ఎటు చూసినా పందులే కనపడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామం నుంచి పందులను తరలించాలి.

'ఎస్సీ కాలనీ నీటి సమస్య పరిష్కరించాలి'

ప్రజాశక్తి - నందవరం

జిల్లా అధికారికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నందవరం గ్రామం ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నాయకులు రంగప్ప మాట్లాడారు. ఎస్సీ కాలనీలో దాదాపు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, కాలనీలో గత ఐదేళ్ల నుంచి తాగునీరు రావడం లేదని తెలిపారు. రోజూ ఉదయం 5 గంటలకే బస్టాండ్ దగ్గరికి వచ్చి తాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. సమస్యపై పంచాయతీ, మండల పరిషత్ అధికారులను కలిస్తే కాలనీకి ప్రత్యేకంగా బోరు వేశామని.. వాటి ద్వారా వచ్చిన నీళ్లు మాత్రమే కాలనీకి వస్తాయంటూ సమాధానం ఇచ్చారని తెలిపారు. గతంలో ఊరిలోని అన్ని కాలనీలకు వచ్చే నీళ్లు తమ కాలనీకి వచ్చేవని, ఇప్పుడు ఈ బోరు నుంచి వచ్చే ఉప్పు నీరు దుర్వాసనతో వస్తున్నాయని తెలిపారు. ఆ నీరు తాగడం వల్ల చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా చేస్తున్నారని విమర్శించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు సురేష్, మల్లేష్, కిషోర్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం, ఇసుక రవాణాపై నిఘా

- సిఐ రామాంజులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని గ్రామాల్లో అక్రమ మద్యం, ఇసుక రవాణా చేస్తున్న వారిపై నిఘా ఉంచినట్లు సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక సిఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయం అసాంఘిక కార్యకలాపాల్లో భాగంగా బెల్టుషాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోస్టులు, సమాచారం పెట్టినా, దేశ, రాష్ట్ర భద్రత విషయంలో దుష్ప్రచారాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక లాడ్జీల నిర్వాహకుల వద్ద ఉన్న లెడ్జర్లను తనిఖీ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు ఆటోలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నడపకుండా ఆటో డ్రైవర్లను హెచ్చరించామని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయం పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమ మద్యం రవాణా, అమ్మకాలు, ఇసుక అక్రమ రవాణా ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రామాంజులు

పోలీసుల పనితీరు హర్షణీయం

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో బెల్టుషాపులపై పోలీసుల పనితీరు హర్షణీయమని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో పట్టణంలో పెద్దబావి, ఇందిరానగర్, శివ సర్కిల్, సోగనూరు రోడ్డు వంటి సెంటర్లలో ఇళ్లు, అంగళ్ల ముందు అరుగులపై కూర్చొని మందు తాగుతూ, బిర్యాని తింటూ జల్సా చేసేవారని తెలిపారు. దీనినీ అరికట్టాలని పోలీసులను కోరినా, ఎలాంటి చర్యలూ తీసుకోలేదని చెప్పారు. ఆ ప్రాంతాల్లో మహిళలు తిరగాలంటేనే ఇబ్బంది పడేవారని తెలిపారు. ఇవన్నీ చూస్తూ ఉన్నా ప్రశ్నించేవారు లేరన్నారు. ఇందిరా నగర్‌లో కొందరు ఇళ్లను చికెన్ షాపులకు అద్దెకు ఇచ్చి అక్కడే మద్యం సేవించే ఏర్పాటు చేశారని తెలిపారు. పోలీసులకు తెలిసినా ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ప్రాంతాల్లో అసాంఘిక వాతావరణం ఏర్పడిందని తెలిపారు. ఇటీవల పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, ఎస్ఐ డాక్టర్ నాయక్, ఇతర కానిస్టేబుళ్లు పట్టణంలో రాత్రి, పగలు పహారా కాస్తున్నారని చెప్పారు. పట్టణంలోని సందు సందులో పోలీసులు తిరగడం వల్ల గంజాయి బ్యాచిలు, ఇతర రౌడీ బ్యాచిలు పరారయ్యాయని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలోకి వచ్చిందని చెప్పారు. బహిరంగంగా మద్యం సేవించే వారిని పోలీసులు తరుముతుండగా మద్యం బాబులు మద్యం గ్లాసులను, వారు తెచ్చుకున్న బిర్యానీలను వదిలేసి పరుగులు తీస్తున్నారని తెలిపారు. పెద్ద బావి సెంటర్‌లో ఇంకా బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని చెప్పారు. పోలీసులు దీన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- వయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ రమణయ్య

ప్రజాశక్తి - దేవనకొండ

నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మండల వయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ రమణయ్య, ఇఒఆర్‌డి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం మహిళా సమాఖ్య కార్యాలయం స్త్రీశక్తి భవన్‌లో అందరికీ విద్యనందించి అక్షరాసులుగా తీర్చిదిద్దాలని 'సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యసనం' నిర్వహించారు. చదువురాని మహిళలకు చదవడం, రాయడం, లెక్కలు వేయడం నేర్పించే అంశాల గురించి వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఒక వాలంటీరు 10 మంది చదువురాని మహిళలకు చదవడం, రాయడం, చిన్న, చిన్న లెక్కలు చేయడం నేర్పించాలని తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయ హెచ్‌డి సిసి నరసన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.NO.361/2022

గొల్లగాలెన్న. ...వాది

-Vs-

గొల్లవెంకటేశ్వర్లు వగైరా. ...ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమన్లు

గొల్ల ఎల్లయ్య తండ్రి గొల్లపూడి చెర్లకృష్ణ వ్యవసాయం వలన జీవనం, ఉలిందకొండ గ్రామము, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదుల నుండి దావా మొత్తము రూ॥ 1,55,330-00 మరియు ముందు వడ్డీ 24% పి.ఎ.ప్రకారం మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో 2వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 26-11-2024 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

బి.మురళిమనోహర్,
ఎన్.సి.రామదాసు,
బి.భావన,
వాదిపరం అడ్వకేట్లు, కర్నూలు.